# 19th & 20th CONVOCATION

**Friday the 11th November 2022, 2:00 PM**

**COVOCATION ADDRESS**

**by**

## *Padma Shri Gaddam Padmaja Reddy*

***Renowed Classical Dancer***




# SRI PADMAVATI MAHILA VISVAVIDYALAM

**(WOMEN'S UNIVERSITY) since 1983**

**Accredited with 'A' Grade by the NAAC**

**Tirupati, India**

# SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM

(WOMENS'S UNIVERSITY) since 1983

TIRUPATI

ANDHRA PRADESH

## NINETEENTH & TWENTIETH CONVOCATION

# CONVOCATION ADDRESS

By

## Smt. G. PADMAJA REDDY

11.11.2022 at 12.00 noon in the

Indira Priyadarshini Auditorium, SPMVV

# “పద్మశ్రీ” శ్రీమతి జి. పద్మజా రెడ్డి, గౌరవ డాక్టరేట్ ప్రధానోత్సవ ఉపన్యాసం

**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం - తిరుపతి, ఆంధ్రప్రదేశ్**

**యత్ర నార్యస్తు పూజ్యంతే, రమతే తత్ర దేవతాః**
**యత్రేతాస్తున పూజ్యంతే సర్వాస్తత్రాశురాః క్రియాః**

అని మనుస్మృతి శ్లోకం ఏం చెబుతుందంటే “ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో, అక్కడ దేవతలు నివసిస్తారు. ఎక్కడ స్త్రీలు వంచనకు గురి కాబడతారో, ఎంత ఉన్నతమైన వ్యక్తులు అయినా, వారు చేసే కార్యాలు నిష్ఫలంగానే మిగిలిపోతాయి.” స్త్రీమూర్తికి ఇచ్చే స్థానాన్ని బట్టి, గౌరవాన్ని బట్టి, ఆ దేశ నాగరికత, చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనం తెలుస్తుంది. భారతీయ సనాతన ధర్మ సంప్రదాయంలో భారతీయ స్త్రీకి సముచిత స్థానమే ఉందనేది నిజం.

ప్రాచీన భారతం నుండి మహిళలు పురుషులతో సమానంగా అన్ని విభాగాలలో సమాన హోదాని గౌరవాన్ని పొందారు. సమాన గౌరవాన్ని పొందేలా వారు తమ వ్యక్తిత్వాన్ని, తమ శక్తిని అనుసరించి తమ ప్రతిభను ప్రదర్శించారు.

భారతదేశం నాగరికతకు మూలమైనదిగా గుర్తింపబడిన సింధునాగరిత, మాతృస్వామిక సామాజికవ్యవస్థగా నిలవటానికి స్త్రీల భాగస్వామ్యం ఎంతో ఉందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. స్త్రీకి సంపూర్ణమైన సాధికారత ఈ దేశంలో పూర్వం నుండే వెల్లివిరిసిందని చెప్పవచ్చును.

ఆ తర్వాత వైదిక సంస్కృతికి మూలమైన వేద నాగరికత గ్రామీణ జీవన సౌశీల్యతను ప్రపంచానికి తెలియపరిచి రాజకీయ పాలనా రంగంలో “సభ–సమితి” అనబడే ప్రజాపాలన సంఘాలలో మహిళలకు ప్రముఖ పాత్ర ఉందని, వారి నిర్ణయానికి ప్రాధాన్యత కల్పించిందని తెలుస్తోంది.

సనాతన భారతీయ చరిత్రలో ప్రాచీనయుగ, మధ్యయుగ, ఆధునిక యుగాలలో స్త్రీ

స్థానం ఉన్నత మహిళ సాధికారత వైపుకే నడిపించాయని తెలుస్తోంది. ఆధ్యాత్మికంగా, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా స్త్రీలు బలోపేతంగానే ఉన్నారని చరిత్ర అధ్యయనం ద్వారా మనకు అవగతమవుతుంది.

పరాయి పాలకుల పాలనలో సైతం మహిళలు మొదటి చక్రవర్తులుగా రాజ్యపాలన చేస్తూ భారతీయ సనాతన స్త్రీ శక్తికి నిదర్శనంగా నిలిచారు. గోండు రాణి దుర్గావతి మొగల్ పాలకులను ధీటుగా ఎదుర్కొన్నది. దక్షిణ భారతదేశంలో కాకతీయుల పాలనకు ఎంతో వన్నె తెచ్చిన రాణి రుద్రమదేవి ఎంతో రాజకీయ చాణక్యం ప్రదర్శిస్తూ దౌత్యపరంగా పాలనాపరంగా, ఆర్థికంగా రాజ్యాన్ని సుభిక్షంగా ఉంచుతూ తన రాజ్యంలోని మహిళలను కూడా ధీరోదాత్తులుగా మలిచారు అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. విద్య, సామాజికం, రాజకీయం సాంస్కృతిక రంగాలలో మహిళలు తమదైన శక్తియుక్తులతో నేటికి భారతీయ మహిళలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

భారత స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగపరంగా మహిళలందరికీ సమానత్వం, సాధికారత, గౌరవాన్ని పెంపొందించే విధంగా భద్రత కల్పించడం జరిగింది. సామాజికంగా, ఆర్థికంగా, స్త్రీలను స్వశక్తులను చేయుటకై ఎన్నో ప్రభుత్వ పరమైన చట్టాలను, ప్రత్యేక పథకాలను భారత ప్రభుత్వాలు కల్పిస్తూనే ఉన్నాయి. భారత మహిళ సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి భారత ప్రభుత్వం ప్రణాళికలు ఏర్పాటు చేసింది.

"స్త్రీ సమాజ నిర్మాత" కావున, భారతీయ వనిత తన కున్న కుటుంబ బాధ్యతలతో పాటుగా, ఆర్థికంగా కుటుంబానికి వెన్నుదున్నుగా ఉండే ఉద్యోగ జీవితంలో సైతం రాణిస్తూ, వృత్తిపరమైన నైపుణ్యాలు ప్రదర్శిస్తూ, అందరికీ ఆదర్శంగా ఉన్నారు.

రాజకీయ రంగంలో, వ్యాపార వాణిజ్యరంగంలో, వైద్య ఆరోగ్య రంగంలో, విద్యా రంగంలో, సాంకేతిక రంగంలో, ఆర్థిక రంగంలో, సాఫ్ట్‌వేర్ రంగంలో మహిళలు అమోఘమైన కృషిచేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించగల్గుతున్నారు. సంపూర్ణ అక్షరాస్యతతోనే మహిళా

సాధికారత సాధ్యమవుతుంది. ఒకప్పుడు తరగతి గదుల్లో ఆడపిల్లలు నాలుగైదు శాతానికి మించి ఉండే వారు కాదు. ప్రస్తుతం స్కూళ్లు, కళాశాలల్లో చూస్తే 61 శాతానికి మించి ఉన్నారు. ఇది అక్షరస్యతతోనే సాధ్యపడిందని చెప్పవచ్చు. ఉద్యోగాల్లో పురుషులతో సమానంగా పనిచేస్తున్నారు మహిళలు.

భారతదేశంలో మహిళ ఉన్నతస్థానంలో ఉంది. అందుకే "మాతృదేవోభవ" అంటారు. తరువాతే పితృదేవోభవ అంటాం. ఇలాంటి పవిత్ర స్థానంలో ఉన్న మహిళకు సంపూర్ణ సాధికారత రావాలి. ఆమె అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్నారు. మహిళల్లో అవగాహన, చైతన్యం పెరగడంతో వారు మరింతగా రాణించగలుగుతున్నారు. ఒకప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు మహిళల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం ఎంతో పెరిగింది. ఏ పదవిలో ఉన్నా, వారి సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ నిలదొక్కుకోగలుగుతున్నారు. ఈ సామర్థ్యాన్ని ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

మహిళలు దేశానికి ప్రధానమంత్రులయ్యారు, దేశాధ్యక్షులవుతున్నారు, అంతరిక్షానికి వెళ్తున్నారు. ఒకప్పుడు కేవలం మగవాళ్ళే చేయదగ్గ పనులన్నింటినీ ఈనాడు ఆడవాళ్ళు చేస్తున్నారు. ఎన్నో రంగాలలో ఆడవాళ్ళు మరింత ముందుకు సాగుతున్నారు. ఈ ప్రగతిని చూసే ఒక కవి – "ముదితల్ నేర్వగరాని విద్య కలదే? ముద్దార నేర్పించినన్" అన్నాడు.

ఎంతో ప్రగతి సాధించిన మహిళల చరిత్రలు మరింత మందికి ప్రేరణ కలిగిస్తాయి అనుటలో సందేహం లేదు. ముఖ్యంగా మహిళలు మరింత ఉత్తేజాన్ని పొందాలి. అప్పుడే తల్లి ఋణం తీర్చుకున్న తృప్తి కలుగుతుంది. ఈ మహిళలను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరు విజయపథం వైపు పయనించాలి. ఆడవాళ్ళు చదవుకుంటే ఎన్ని అద్భుతాలు చేయవచ్చు ! మగవాడి చదువు అతనికే పరిమితం కానీ ఆడవాళ్ళ చదువు ఇంటింటి వెలుగు !

నిజమైన మహిళా సాధికారత వల్ల దేశానికి కలిగే ప్రగతి గురించి మాట్లాడినట్లయితే, ఈ క్రింది విషయాలు ప్రదానంగా చెప్పవచ్చును.

- **అద్భుతమైన ప్రగతి**

  ప్రతీ కుటుంబ వ్యవస్థలో మహిళలే ముఖ్యమైన సంరక్షకులుగా ఉంటారు. ప్రపంచ వ్యాప్తమైన సర్వేల ప్రకారం, ఏవైనా సామాజిక సమస్యలు, ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడ్డప్పుడు కూడా కుటుంబాన్ని నెట్టుకుంటూ, అన్ని కార్యాలు సమర్థవంతంగా నిర్వహించగలిగే శక్తిని కేవలం మహిళలే కలిగి ఉంటారు. మంచి పోషక విలువలున్న ఆహారం అందించడం, కుటుంబ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, కుటుంబ స్త్రీలకు వెన్నతో పెట్టిన విద్య. అలాంటి స్రీలు సాధికారత సాధిస్తే దేశం అన్ని రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా ముందడుగు వేస్తుంది.

- **ఎక్కువ అధికారం**

  చిన్న చిన్న కుటుంబాలుగా జనాలు మనుగడ సాగిస్తున్న నేపథ్యంలో, మహిళలు తమ జీవనశైలిని మార్చుకుని, ఉద్యోగం చేయడం, తదితర కుటీర పరిశ్రమలు నిర్వహించడం చేస్తే, భారతదేశ ఆర్థికవ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

- **వ్యాపారంగంలో మహిళలు**

  స్త్రీల నేతృత్వంలోని సంస్థలు, పురుషుల నేతృత్వంలోని సంస్థలతో పోలిస్తే 34% అధిక లాభాలు అందిస్తాయి.

- **కుటుంబ పోషణ**

  కుటుంబ పోషణ కోసం స్త్రీలలో అంతర్లీనమైన అవసరం ఒక కీలక అంశం. వారు 85% కొనుగోలు నిర్ణయాలు తీసుకుంటున్నందున, మెరుగైన జీవనశైలిని అందించాల్సిన అవసరం మహిళలను ప్రేరేపిస్తుంది.

- **విద్య**

  సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ పరిశ్రమల్లో మహిళా గ్రాడ్యుయేట్‌లను ఉత్పత్తి చేయడంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉంది.

- **మహిళలే దేశప్రగతికి సూచికలు**

  మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. నీతి, నిజాయితీ, నిబద్ధత, నైతికతతో కూడిన ఆరోగ్యకరమైన కుటుంబవ్యవస్థను, సమాజాన్ని స్థాపించుకోవాలి. మహిళలంతా సమస్యల పరిష్కారశక్తులుగా ఎదగాలి. ఎదిగిన కొద్దీ ఒదగాలి. అది మనమే ఎందుకు చేయాలి అంటే మహిళలు అనుకుంటే ఏదైనా చేయగలరు. కనుకనే ప్రపంచ దేశాలు మన కుటుంబ వ్యవస్థకు జేజేలు పలుకుతున్నాయి. ఏ దేశమైనా స్త్రీలను గౌరవించితేనే గొప్ప దేశం అవుతుంది.

- **ఎందరో మహిళామణులు**

  నాటి నుండి నేటి దాకా వ్యవసాయం మొదలుకొని రక్షణ, సాంకేతిక, సాహిత్య, సంగీత, సామాజిక, క్రీడా, రాజకీయ, ఆర్థిక, ధార్మిక రంగాల్లో మహిళలు ఎందరో దేశాభివృద్ధిలో పాత్రధారులు అవుతున్నారు. ప్రపంచానికే తలమానికమైన భారతదేశ ప్రగతి రథ సారథులుగా మారిపోయారు.

★ ★ ★

నాట్యంలో రీసెర్చర్‌గా, అంతర్జాతీయ వేదికలమీద నాట్య కళాకారిణిగా, నాట్య రచయితగా, నృత్యదర్శకురాలిగా, నాట్య గురువుగా నాకున్న అనుభవంతో నాట్యంలో కొత్త ప్రయోగాలు చేయడానికి ప్రయత్నం చేశాను.

గత 50 సంవత్సరాలుగా, కూచిపూడి నాట్యంలో 3000 పైగా ప్రదర్శనలు ఇచ్చాను. అలాగే ప్రణవ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డాన్స్ ద్వారా వేలాది విద్యార్థులకు నాట్యంలో శిక్షణ అందించాను.

ఎంతో మంది మహిళా విద్యార్థులకు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి శిక్షణ అందించాను. కూచిపూడిలో ఉన్నత స్థాయి శిక్షణతోపాటు, వినూత్నమైన అంశాలపై మ్యూజికల్ డాన్స్ బ్యాలేలకు రూపకల్పన చేసాను.

భ్రూణ హత్యల నేపథ్యంలో కూచిపూడి నాట్యంలో ఒక బ్యాలే చేశాను.
అలాగే ఎయిడ్స్ అవగాహన కోసం "జాగృతి" అని ఒక బ్యాలే చేశాను.
జాతీయ సమగ్రత కోసం "వజ్ర భారతి" అనే బ్యాలే చేశాను.

ఇలాంటి వినూత్న నృత్య రూపకాలు కల్పన చేసి నా విద్యార్థినులతో కలిసి ప్రదర్శనలు ఇచ్చాను.

యావత్ భారతదేశంలోనే ఉన్నతమైన విలువలకు, ప్రామాణిక విద్యకు తలమానికంగా పేరుపొందిన "శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం" ద్వారా "గౌరవ డాక్టరేట్" అందుకోవడం నాకు ఎంతో గర్వకారణంగా ఉంది.

శాస్త్రీయ నాట్యరంగంలో ఎన్నో సవాళ్లను అధిగమించి, జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శనలు ఇచ్చే అవకాశం నాకు లభించింది. అది నా పూర్వజన్మ ఫలితం అని నేను భావిస్తాను.

"సాధించినదానికి సంతృప్తిని పొంది అదే విజయమనుకుంటే పొరపాటోయి" అనే సిద్ధాంతాన్ని నమ్మే నేను, కాకతీయులకాలం నాటి ప్రాచీన నృత్యశైలిని "కాకతీయం" అనే పేరుతో వెలికితీసి, గ్రంథస్థం చేసి, ఆ నృత్యాన్ని వివిధ స్థాయిల్లో అందరు నేర్చుకునేలా ప్రస్తుతం కృషి చేస్తూన్నానని మీ అందరికి చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను.

శ్రీ పద్మావతి మహిళా విశ్వావిద్యాలయం వారు అందిస్తున్న ఈ గౌరవ డాక్టరేటు ఒక ప్రోత్సాహకంగా నేను భావిస్తాను. "కాకతీయం" బృహత్ కార్యక్రమంలో మునిగితేలుతున్న నాకు, ఈ సన్మానసత్కారాలు ఒక ఉత్ప్రేరకంగా తోడ్పడుతాయని ప్రగాఢంగా విశ్వాసిస్తాను.

ఈ స్నాతకోత్సవం సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులుగా మరియు ఇతర కోర్సులు పూర్తి చేసి ఉద్యోగరంగంలోకి ప్రవేశిస్తున్న మహిళా విద్యార్థినిలకు నా మనఃపూర్వక అభినందనలు మరియు శుభాశీస్సులు తెలుపుతున్నాను. ఈ గౌరవ డాక్టరేట్ కోసం నన్ను ఎంపిక చేసిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పాలకమండలికి, అలాగే అధ్యాపక బృందానికి నా కృతజ్ఞతలు.

మీ

**శ్రీమతి జి. పద్మజా రెడ్డి**

"పద్మశ్రీ అవార్డు గ్రహీత"

హైదరాబాద్.